# శ్రీ కృష్ణ తత్త్వం
## ◆ రుక్మిణీ కల్యాణం ◆
శుక యోగీంద్రులు మౌనము గా ధ్యానిస్తున్న సమయం లో  ఆ మౌనాన్ని తట్టుకోలేని వాడైన పరీక్షిత్ మహారాజు ఈ విధంగా అంటున్నాడు
కృష్ణ కథ ఆగిపోతే తట్టుకోలేడు భక్తుడు.
*కృష్ణ కథలు కల్యాణాత్మకములు,మంగళ కరములు.*

◈◈◆◈◈◆◈◈◆◈◈◆
కల్యాణాత్మకమైన విష్ణుకథ లాకర్ణించుచున్ *ముక్త వై
కల్యుండెవ్వఁడు*  తృప్తుఁ డౌ!!?అవి *వినంగాఁ గ్రొత్త లౌచుండు* *సా
కల్యం బేర్పడ*  భూసురోత్తమ! యెఱుంగం బల్కవే; రుక్మిణీ
కల్యాణంబు వినంగ నాకు మదిలోఁ గౌతూహలం బయ్యెడిన్.
◈◈◆◈◈◆◈◈◆◈◈◆
*ముక్తవైకల్యుడు* అంటే సంపుర్ణమైన వ్యక్తిత్త్వం కలవాడు
సాకల్యం బేర్పడ=సంపూర్ణంగా కృష్ణ కథ కావాలి

రుక్మిణీ అంటే మహాలక్ష్మీ స్వరూపం
హిరణ్యవర్ణాం సువర్ణ స్వరూపం (శ్రీ సూక్తం)
నారాయణుని విడిచి పెట్టలేని శక్తి =అనపగామినీం

**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ  గారి ప్రవచనం శ్రీకృష్ణతత్త్వం8/8.

◈◈◆◈◈◆◈◈◆◈◈◆
# శ్రీ కృష్ణ తత్త్వం-2
## ◆ రుక్మిణీ కల్యాణం ◆
శుకయోగీంద్రులు పరీక్షిత్ మహరాజు తో యీవిధంగా ఆనందంగా వివరిస్తున్నాడు
◈◈◆◈◈◆◈◈◆◈◈◆
"వినుము; విదర్భదేశమున వీరుఁడు కుండినభర్త భీష్మకుం
డను నొక దొడ్డరాజు గలఁ; డాతని కేవురు పుత్రు లగ్రజుం
డనయుఁడు రుక్మి నాఁ బరఁగు; నందఱకుం గడగొట్టు చెల్లెలై
మనుజవరేణ్య! పుట్టె నొక మానిని రుక్మిణినాఁ బ్రసిద్ధయై.
◈◈◆◈◈◆◈◈◆◈◈◆

*రుక్మిణీ కల్యాణం అందరికీ తెలిసినదైనా  ఎప్పటికప్పుడు మననం చేసుకోవలసిన గాథ*
విదర్భ దేశంలో కుండినీ నగరాన్ని రాజధాని గా చేసుకొనిభీష్మకుడు అనే రాజు పాలిస్తూవుండేవాడు.ఆయనకు ఐదుగురు పుత్రులు.రుక్మి ,రుక్మ రథ, రుక్మ బాహు ,రుక్మకేశ, రుక్మమాలి.ఈ ఐదుగురు తరువాత పుట్టింది రుక్మిణి.
రుక్మిణీ అంటే సాక్షాత్తు మహాలక్ష్మీ స్వరూపం
హిరణ్యవర్ణాం సువర్ణ స్వరూపం (శ్రీ సూక్తం)
నారాయణుని విడిచి పెట్టలేని శక్తి =అనపగామినీం.
రుక్మిణీ దేవి బాల్యంలో తన తండ్రి గృహమునందు ఈ విధంగా వుండేది.
◈◈◆◈◈◆◈◈◆◈◈◆
తన తండ్రి గేహమునకుం
జనుదెంచుచు నున్న యతిథిజనులవలనఁ గృ
ష్ణుని రూప బల గుణాదులు
విని కృష్ణుఁడు దనకుఁ దగిన విభుఁడని తలఁచెన్.
◈◈◆◈◈◆◈◈◆◈◈◆
కృష్ణుని గుణగణాలు విని రుక్మిణి ఆయన గురించే చింత చేస్తూ వుండేది.     భీష్మకుడు కూడా రుక్మిణి ని కృష్ణున కు యిచ్చి వివాహం చేద్దామని అనుకున్నాడు.
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ  గారి ప్రవచనం
◈◆◈◆◈◈◆◈◈◆◈

## శ్రీ కృష్ణ తత్త్వం-3
## ◆రుక్మిణీ కల్యాణం◆

బంధువు లెల్లఁ గృష్ణునకు బాలిక నిచ్చెద మంచు శేముషీ
సింధువులై విచారములు చేయఁగ వారల నడ్డపెట్టి దు
స్సంధుఁడు రుక్మి కృష్ణునెడఁ జాల విరోధముఁ జేసి మత్త పు
ష్పంధయవేణి నిత్తు శిశుపాలున కంచుఁ దలంచె నంధుఁడై
◈◈◆◈◈◆◈◈◆◈◈◆
రుక్మిణీ అన్నగారైన రుక్మి తన స్నేహితుడై న శిశుపాలునికి ఇచ్చి వివాహం చేద్దామని అనుకుంటాడు.
రుక్మిణి ఆవేదనతో కృష్ణుడు తనకు దక్కుతాడో లేదో తనకు దిక్కెవరు అని ఆలోచిస్తూ వారికి ఆప్తుడైన ఒక బ్రాహ్మణుని పిలిచి కృష్ణుని తో తన  మొర వినిపించమని ఆయన వచ్చి తనను తీసుకువెళ్ళవలసినదిగా
చెప్పమని  కృష్ణుని గురించి *తన మనస్సు తపిస్తున్నదని ఆయన యందే

ఆశక్తమై అనుబంధం కలిగివుందని ఆయన వచ్చి తనను చేపట్టాలని విన్నవించమని చెప్పగా ఆ బ్రాహ్మణుడు ద్వారకకు బయలుదేరుతాడు.
ద్వారక లో కనకాసీనుడైన పురుషోత్తముడైన శ్రీ కృష్ణ పరమాత్మ ఆ బ్రాహ్మణోత్తముని చక్కగా ఆహ్వానము పలకగా
ఆ పరమాత్ముని చూసిన ఆ బ్రాహ్మణునకు భక్తి కలిగి ఆశీర్వదించెను.

*గృహస్తు మర్యాద సూచకంగా శ్రీ కృష్ణ పరమాత్మ ఆ వేదవేత్తుని పాదములు కడిగి నీళ్ళు తన శిరస్సు మీద చల్లుకుని* పరామర్శించగా రుక్మిణి సందేశాన్ని ఈ విధంగా తెలియచేస్తున్నాడు.

◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆

ఏ నీ గుణములు కర్ణేంద్రియంబులు సోఁక;
దేహతాపంబులు దీఱిపోవు
నే నీ శుభాకార మీక్షింపఁ గన్నుల;
కఖిలార్థలాభంబు గలుగుచుండు
నే నీ చరణసేవ యే ప్రొద్దు చేసిన;
భువనోన్నతత్వంబుఁ బొందఁ గలుగు
నే నీ లసన్నామ మే ప్రొద్దు భక్తితోఁ;
దడవిన బంధసంతతులు వాయు
నట్టి నీ యందు నా చిత్త మనవరతము
నచ్చి యున్నది నీ యాన నాన లేదు,
కరుణఁ జూడుము కంసారి! ఖలవిదారి!
శ్రీయుతాకార! మానినీచిత్తచోర!

**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం

◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆

## శ్రీ కృష్ణ తత్త్వం-4
## ◆ రుక్మిణీ కల్యాణం ◆

*తల్లి రుక్మిణి పథక రచన ఈవిధంగా చేస్తోంది*

◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈

భావించెదేని యుపాయంబు చెప్పెద;
నాలింపు కులదేవయాత్రఁ జేసి
నగరంబు వెలువడి *నగజాతకును* మ్రొక్కఁ;
బెండ్లికి మునుపడఁ బెండ్లికూఁతుఁ
నెలమి మావారు పంపుదు రేను నట్లు

పురము వెలువడి యేతెంచి భూతనాథు
సతికి మ్రొక్కంగ నీవు నా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత!
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
*నగజాత=పర్వత రాజ పుత్రికైన పార్వతి*
తన చివరి మాటగా ఈవిధంగా చెప్తోంది రుక్మిణీ వినవయ్యా కృష్ణయ్యా అని అంటున్నాడు ఆ బ్రాహ్మణుడు.అతని పేరు అగ్నిద్యోతనుడు అంటే అగ్నివలే ప్రకాశించువాడు.
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
*ప్రాణేశ!* నీ మంజు భాషలు వినలేని;
కర్ణరంధ్రంబుల కలిమి యేల?
*పురుషరత్నమ!* నీవు భోగింపఁగా లేని;
తనులతవలని సౌందర్య మేల?
*భువనమోహన!* నిన్నుఁ బొడగానఁగా లేని;
చక్షురింద్రియముల సత్త్వ మేల?
*దయిత!* నీ యధరామృతం బానఁగా లేని;
జిహ్వకు ఫలరససిద్ధి యేల?
*నీరజాతనయన!* నీ వనమాలికా
గంధ మబ్బలేని ఘ్రాణ మేల?
*ధన్యచరిత!* నీకు దాస్యంబు జేయని
జన్మ మేల? యెన్ని జన్మములకు."

◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
ఇంతవరకూ రుక్మిణీ దేవి అభిప్రాయము చెప్పాను, ఇప్పుడు *నా అభిప్రాయము చెపుతాను విను కృష్ణయ్యా అని అంటున్నాడు అగ్ని ద్యోతనుడు*
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
ఆ యెలనాగ నీకుఁ దగు; నంగనకుం దగు దీవు మా *యుపా
ధ్యాయుల యాన* పెండ్లి యగుఁ; దప్పదు జాడ్యములేల? నీవు నీ
తోయమువారిఁ గూడుకొని తోయరుహాననఁ దెత్తుగాని వి
చ్చేయుము; శత్రులన్ నుఱుముజేయుము; చేయుము శోభనం బిలన్."
నిజ తపః ఫలాభ్యాం made for each other లాగావున్నారు.మా గురువుల మీద ఒట్టుపెట్టి చెపుతున్నాను మీ యిద్దరికీ ఖచ్చితంగా పెళ్ళి అవుతుంది.

Source:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ  గారి ప్రవచనం
◈◈◆◈◆◈◈◆◈◈◆◈

# శ్రీ కృష్ణ తత్త్వం-5
# ◆రుక్మిణీ కల్యాణం◆

*వాసుదేవాగమనము*
స్వామి మందహాసము చేసి తప్పకుండ నేను వస్తాను అని అన్నాడు
◆◈◆◈◈◆◈◈◆◈
వచ్చెద విదర్భభూమికిఁ;
జొచ్చెద భీష్మకుని పురము; సురుచిరలీలన్
దెచ్చెద బాలన్ వ్రేల్మిడి
వ్రచ్చెద నడ్డంబు రిపులు వచ్చినఁ బోరన్."

◆◈◆◈◈◆◈◈◆◈
దన పంపున రథసారథి యైన దారకుండు సైబ్య సుగ్రీవ మేఘ
పుష్పవలాహకంబు లను తురంగంబులం గట్టి రథమాయత్తంబు చేసి తెచ్చిన
నమోఘ మనోరథుండైన హరి తానును, బ్రాహ్మణుండును రథారోహణంబు జేసి
యేకరాత్రంబున నానర్తకదేశంబులు గడచి, విదర్భదేశంబునకుఁ జనియె;
◆◈◆◈◈◆◈◈◆◈
*అమోఘ మనోరథుండైన హరి*
రామాయణం లో రాముడు ని సత్య పరాక్రమః అని అన్నారు.
ఇక్కడ సత్యకామ సత్య సంకల్పః అని అన్నారు
మనోరథము =కోరిక
వ్యర్ధముకాని కోరిక కలవాడు
వ్యర్ధముకాని సంకల్పము కలవాడు అనుకున్నాడంటే నెరవేర్చి తీరుతాడు.
ఆ రథానికి నాలుగు గుర్రాలు వున్నాయి.
సైబ్య -సుగ్రీవ-మేఘపుష్ప-బలాహక
దారకుడు రథసారధి
*ఆ బయలుదేరతున్న రథాన్ని తలచకోవటం ఒక విశేషం* ఈ రథం లోనే
అమ్మ ను పిలుచుకువస్తాడు స్వామి.
బలభద్రుడు మొదలగు యదు వీరులు వెనకాల బయలుదేరారు
అమ్మ ను పెళ్ళి కూతురుని చేశారు

పితృ దేవతలను అర్చించి ...
*పితృదేవతల తారణ కోసమే వివాహం* ఎందుకంటే నీదాకా వచ్చిన ఏ పరంపర వున్నదో ఆ పరంపర వివాహమనే యజ్ఞం ద్వారా కొనసాగిస్తావు అందుకనే వివాహం జరుగుతుంటే పితృదేవతలు సంతోషిస్తారు. ఆ కారణం చేతనే పెళ్ళి లో ప్రవరలు చెప్పి తాతలను

ముత్తాతలను తలుచుకునే సంప్రదాయం మనకు వున్నది.అందుకునే ముందుగా నాందీ అని పలికి విత్తనాలు అవి వెయ్యటం జరుగుతుంది. అది పితృదేవతలను అర్చించటం.
విప్రులకు భోజనములు పెట్టించి మంగళ ఆశీర్వచనాలు పలికించి రుక్మిణీ దేవి ని అభిషిక్తము చేసి మంగళ స్నానములు ఇత్యాదులు చేసి పెళ్ళికూతురుగా ఆమె అనేక రత్నములు అలంకరించుకుంది ,
కానీ తన మనసు మాత్రం దిగులుతో, తన కబురు కృష్ణునకు చేరిందో లేదో అని ఒక రకమైన విరక్తి తో వున్నది అమ్మ రుక్మిణి దేవి.
◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈
చెప్పదు తల్లికిం దలఁపు చిక్కు; దిశల్ దరహాస చంద్రికల్
గప్పదు; వక్త్రతామరసగంధ సమాగత భృంగసంఘమున్
రొప్పదు; నిద్ర గైకొన; దురోజ పరస్పర సక్త హారముల్
విప్పదు; కృష్ణమార్గగత వీక్షణపంక్తులు ద్రిప్ప దెప్పుడున్.
◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈
"లగ్నం బెల్లి; వివాహముం గదిసె నేలా రాఁడు గోవిందుఁ? డు
ద్విగ్నం బయ్యెడి మానసంబు వినెనో వృత్తాంతమున్? బ్రాహ్మణుం
డగ్నిద్యోతనుఁ డేటికిం దడసె? నా యత్నంబు సిద్ధించునో?
భగ్నంబై చనునో? విరించికృత మెబ్భంగిన్ బ్రవర్తించునో?
◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈
ఘను డా భూసురు డేగెనో? నడుమ మార్గశ్రాంతుఁడై చిక్కెనో?
విని కృష్ణుం డిది తప్పుగాఁ దలఁచెనో? విచ్చేసెనో? యీశ్వరుం
డనుకూలింపఁ దలంచునో తలఁపడో? *యార్యామహాదేవియున్*
నను రక్షింప నెఱుంగునో యెఱుఁగదో? నా భాగ్య మెట్లున్నదో?"
◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈
నేను ఎప్పుడూ కొలుచుకునే ఇష్ట దేవత అయిన *గౌరమ్మ* నన్ను అనుగ్రహిస్తుందో లేదో అని అంటోంది అమ్మ రుక్మిణి.
రుక్మిణీ దేవి కూడా ఆ గౌరీ దేవి ని కొలుచుకుంటోంది.
*గౌరీ పూజ ప్రాముఖ్యత*

*ఆర్యామహాదేవి=గౌరి,గిరిజ,రుద్రాణి,రుద్ర పత్ని*
గౌరీదేవి ని ఆరాధిస్తే తొందరగా వివాహము జరుగుతుందనీ అనుకున్న మంచి వరుని తో వివాహము జరుగుతుందనీ అప్పటి నుంచీ వున్న సంప్రదాయం మనది.
అందుకనే పెళ్ళిళ్ళ ల్లో కూడా ముందు గౌరీపూజ చేయిస్తారు. ఆ ఆది సువాసిని పెద్ద ముత్తైదువ అనుగ్రహం వున్న ఆ కుటుంబము క్షేమంగా వుంటుంది..
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం
◈◈◆◈◆◈◈◆◈◈◆◈

# శ్రీ కృష్ణ తత్త్వం-6
# ◆ రుక్మిణీ కల్యాణం ◆

ఇట్లు హరిరాక కెదురుచూచుచు *సకల ప్రయోజనంబులందును విరక్త తో వుండి* చూస్తూ వుండగా శ్రీకృష్ణ పరమాత్మ కొంత సేపటికి నగరము లో అడుగుపెట్టాడు. స్వామి రథము నుండీ దిగి ఆ బ్రాహ్మణుని రుక్మిణీ దేవి దగ్గరకు పంపగా అతడ్ని చూడగానే దిగ్గని లేచి ఏమైనదని చూడగా అతను ఈ విధంగా చెపుతున్నాడు.......
◈◆◈◆◈◈◆◈◈◆

"మెచ్చె భవద్గుణోన్నతి; కమేయ ధనావళు లిచ్చె నాకుఁ; దా
వచ్చె *సుదర్శనాయుధుఁడు* వాఁడె; సురాసురు లెల్ల నడ్డమై
వచ్చిననైన రాక్షసవివాహమునం గొనిపోవు నిన్ను; నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వము నేడు ఫలించెఁ గన్యకా!"
◈◆◈◆◈◈◆◈◈◆

రుక్మిణీ దేవి ఆనందంతో కనుల నీరు వచ్చింది. ఆశ ,ఆసరా లేని సమయములో ఈ బ్రాహ్మణుని సహాయము తో కృష్ణుడు ని రప్పించుకుంది.

*పరమాత్మను నీకు ఎవరిస్తారో ఆ గురువు కు నువ్వు ఏమిచ్చినా కూడా చాలదు*
◈◆◈◆◈◈◆◈◈◆

"జలజాతేక్షణుఁ దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి; నన్
నిలువం బెట్టితి; నీ కృపన్ బ్రతికితిన్ నీ యంత పుణ్యాత్మకుల్
గలరే; దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం గావింప నే నేర; నం
జలిఁ గావించెద; భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!
◈◆◈◆◈◈◆◈◈◆

అంత విదర్భపురంబు ప్రజలు హరిరాక విని వచ్చి చూచి నేత్రాంజలులం దదీయ వదనకమల మధుపానంబుఁ జేయుచు...

*విదర్భపు ప్రజలు కృష్ణుని సౌందర్యాన్ని రెండు కళ్ళు అనే దోసిళ్ళ తో పానము చేస్తూ ఈ విధంగా అనుకున్నారు*
◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
"తగు నీ చక్రి విదర్భరాజసుతకుం; దథ్యంబు వైదర్భియుం
దగు నీ చక్రికి; నింత మంచి దగునే? దాంపత్య మీ యిద్దఱం
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరిగదా; దర్పాహతారాతియై
మగఁడౌఁ గావుతఁ జక్రి యీ రమణికిన్ *మా పుణ్యమూలంబునన్*
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
అక్కడేమో అగ్ని ద్యోతనుడు వాళ్ళ గురువుల మీద ఒట్టు పెట్టాడు వీళ్ళ యిద్దరికీ వివాహముఅవ్వాలని,యిక్కడ విదర్భ ప్రజలు *మా పుణ్యాలన్నీ ధారపోస్తాము*,మా రుక్మిణీ దేవి కి కృష్ణుడే మగడు అగు గాక అని అనుకున్నారు.
అమ్మ రుక్మిణి శివాలయమునకు చేరుకుని నమస్కరిస్తూ ఈవిధంగా అంటోంది.
*భవానీం  భవ పత్నీం భవాన్వితామ్ శివుడు తో  పాటువున్న
అమ్మ  స్వసంతానయుతాం శివాం గణపతి కుమారస్వామి తో
యున్న  అమ్మ  అంటే  మొత్తం  శివపరివారానికి  నమస్కారం చేసుకుంది రుక్మిణీ దేవి**అమ్మా నీ దయవల్ల నాకు భగవానుడైన శ్రీకృష్ణుడు పతియగు గాక  ..ఇందులో ఏ ఆటంకము కలుగకూడదు  అని   నమస్కారం చేసుకున్నది*
*భూమి ఉన్నంతకాలం వుండిపోయే అందమైన పద్యం*
◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
"నమ్మితి నా మనంబున సనాతను లైన యుమామహేశులన్
మిమ్ముఁ బురాణదంపతుల మేలు భజింతుఁ గదమ్మ! మేటి పె
ద్దమ్మ! దయాంబురాశివి గదమ్మ! హరిం బతిఁ జేయుమమ్మ! ని
న్నమ్మినవారి కెన్నటికి నాశము లేదు గదమ్మ! యీశ్వరీ!"
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ  గారి ప్రవచనం
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈

## శ్రీ కృష్ణ తత్త్వం-7
## ◆ రుక్మిణీ కల్యాణం ◆

*నిను నమ్మినవారికి నాశము లేదు కదమ్మ ఈశ్వరి*అమ్మ వారిని నమ్మిన వారికి ఎప్పుడు నాశము లేదు లేదు లేదు.ఇది మహాలక్ష్మి చెప్తున్న మాట.దాంపత్యం అంటే ఏమిటో, ప్రేమ అంటే ఏమిటో, భార్యా భర్తల అనుబంధము ఏమిటో  *ఆది దంపతులయిన* వారిద్దరికే తెలుసు. ఒకరి కోసం ఒకరు తపించి పెళ్ళి చేసుకున్నారు *పార్వతీ పరమేశ్వరులు*నిజ తపః ఫలాభ్యాం,సనాతనులు, శాశ్వతమైనవారు.

*అప్పయ్య దీక్షితులు* మహా పండితుడు.శంకరాచార్యులు తరువాత అంతటి వారు.ఈ ఘట్టాన్ని బాగా భావన చేశారు.
రుక్మిణీ దేవి కృష్ణుడు తో ఈ విధంగా అంటోందంట,
" ఓ నారాయణా ఇదివరకటి జన్మలోమనల్ని  వివాహము అయిన తరువాత మనల్ని వేరు చేయాలని ప్రయత్నం చేసిన అసురుడు చెయ్యలేక వాడే నశించి పోయాడు. అందువలన వివాహము అయిన తరువాత వాళ్ళది బంధం గట్టిపడుతుందని కనుక వేరుచేయ్యలేము

కనుక ఇప్పుడు వివాహం జరగకముందే వేరు చేద్దామని చూస్తున్నాడు వాడి వల్ల కాలేదు.లక్ష్మీనారాయణుల
అనుబంధం అవిభాజ్యము".
*శ్రీ సూక్త వర్ణన*
ఈవిధంగా అమ్మ రుక్మిణీ దేవి ప్రార్థించింది. అటు తరువాత విప్రవనితలు ముత్తైదువులు  ఆమెను ఆశీర్వదించారు.
ఆలయం నుంచి అమ్మ రుక్మిణీ దేవి రాజ లాంఛనాలతో కదలి వస్తోంది.రథములు,ఏనుగులు,ఎదురుగా అశ్వములు వెనకాల ఏనుగులు ఆ ఏనుగులు కూడా మధ్య మధ్య లో ఘీంకరిస్తున్నాయి.చుట్టూ రాజభటులు,తల్లి చుట్టూ కొంతమంది చెలికత్తెలు ఈ వస్తున్న రూపాన్ని అద్భుతంగా వర్ణిస్తున్నారు.మబ్బుల మధ్య లో వున్న *మెరుపు తీగ* లాగా వుందట అమ్మ......
ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారు మెఱుంగు తెఱంగున, ఆమె కాలి మువ్వల సవ్వడులు చెవుల పండగ చేస్తున్నాయి. శింజాన మంజు మంజీర నినదంబులు చెవుల పండువులు చేయఁ, పాద సంచారంబున హరిరాక కెదురుచూచుచు ......
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ  గారి ప్రవచనం
◈◈◆◈◆◈◈◆◈◈◆◈

## శ్రీ కృష్ణ తత్త్వం-8
## ◆ రుక్మిణీ కల్యాణం ◆

◈◈◆◈◆◈◈◆◈◈◆◈
శింజాన మంజు మంజీర నినదంబులు చెవుల పండువులు చేయఁ, బాద సంచారంబున హరిరాక కెదురుచూచుచు .....

*ఆమె చూపులు కృష్ణుని కోసం అన్వేషిస్తున్నాయి*.ఆమె కాలి మువ్వల సవ్వడులు చెవుల పండగ చేస్తున్నాయి అని అంటున్నారు పోతనగారు.ఇది అంతా కూడా మహాలక్ష్మీ స్వరూపాన్ని మన హృదయంలో ప్రతిష్ఠ చేయటానికి. ఎందుకంటే లక్ష్మీ దేవి కాలిమువ్వల సవ్వడులు మన దరిద్రాలను పోగొడుతాయి. ఈ స్వరూపాన్ని ధ్యానించిన వారి దరిద్రాలు పోతాయి. పైగా ఈ వస్తున్న తల్లి శ్రీ సూక్తం కదిలి వస్తోందా అన్నట్లుగా వుంది.
అశ్వపూర్వాం రథ మధ్యాం హస్తినాద-ప్రబోధినీమ్
అట్లాంటి వాతావరణం అంతా అక్కడ కనపిస్తోంది.రుక్మము అంటే బంగారము.రుక్మిణి అంటే సువర్ణ స్వరూపము అని అర్థం
బంగారపు రంగ తో వున్నది ఆ తల్లి. *ఉదయిస్తున్న సూర్యు ని యొక్క అద్భుతమైన తేజస్సు కూడా బంగారు రంగే కదా!!!!*
*చక్కని కాంతిమయమైన చైతన్య శక్తి కి సంకేతము బంగారము హిరణ్మయము*
*హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజామ్* శ్రీ సూక్తం లో మొట్టమొదటి మాట రుక్మిణి శబ్దానికి అర్థము.
ఈవిధంగా అమ్మ వస్తుంటే పక్కనున్న చెలికత్తెలు అంటున్నారు ఇక్కడ చాలా మంది రాజకుమారులు వున్నారు అమ్మా అని *నేను చంద్రుడుని వెతుకుతుంటే చుక్కలు గురించి చెపుతారు ఎందుకు అని అంటోంది అమ్మ*
ఆ చంద్రుడుని చూడాలనే నెపంతో
యేణీలోచన తన వామకర నఖంబుల నలకంబులు దలఁగం ద్రోయుచు నుత్తరీయంబు చక్కనొత్తుచుఁ గడకంటి చూపులం గ్రమంబున నా రాజలోకంబు నాలోకించుచు.
నుదుటి మీద పడుతున్న మేలి ముంగురులు సవరించు కుంటున్న మిష తో చూస్తుండగా ఎదురుకుండా కనిపించాడు అచ్యుతుడైన శ్రీ కృష్ణ పరమాత్మ.
*ఆ కనబడిన కృష్ణుడు ని చూడగానే ఒళ్ళు ఝల్లు మన్నది ప్రథమ దర్శనం*
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈
కనియెన్ రుక్మిణి చంద్రమండలముఖుం, గంఠీరవేంద్రావల
గ్ను, నవాంభోజదళాక్షుఁ, జారుతరవక్షున్, మేఘసంకాశదే
హు, నగారాతి గజేంద్రహస్త నిభ బాహుం, జక్రిఁ, బీతాంబరున్,
ఘనభూషాన్వితుఁ గంబుకంఠు, విజయోత్కంఠున్ జగన్మోహనున్.
◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆
సుందరాకారుడు దివ్య మంగళ విగ్రహుడు సాక్షాత్తు
పరమేశ్వర తేజోరూపమయిన శ్రీకృష్ణుని చూసినటువంటి తల్లి ఆనందించింది ఒక్కసారిగా.....పైగా అతని యొక్క లావణ్య, వైభవ, గాంభీర్య చాతుర్య తేజో విశేషంబులకు సంతసించింది.

ఆ స్వరూపంలోంచి కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి
పరాక్రమము,తేజస్సు,దివ్య గుణములు,అన్నీ కూడా ఆ తేజస్సు లో
కనిపిస్తున్నాయి.
అవి చూసి ఈమె ఆనందిస్తున్న సమయంలో కృష్ణ పరమాత్మ ఒక్కసారిగా
రథం మీద నుంచి దిగి ఆమె చెయ్యి పట్టుకుని రథం మీద
కూర్చో పెట్టాడు.ఆశ్చర్యచకితంగా జరిగింది.
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం
◈◈◆◈◆◈◈◆◈◈◆◈

## శ్రీ కృష్ణ తత్త్వం-9
## ◆రుక్మిణీ కల్యాణం◆

ఇది ఒక మెరుపుదాడి వంటిది.ఎవరు అడ్డు వస్తారో రండి అన్నట్టు గా తన చేతి
లోని పాంచజన్య శంఖాన్ని పూరించి రథాన్ని కదిలించాడు కృష్ణ పరమాత్మ....
హరి తన రథంబుమీఁద నిడికొని భూనభోంతరాళంబు నిండ శంఖంబు
పూరించుచు బలభద్రుండు తోడ నడవ, యాదవవాహినీ పరివృతుండై
ద్వారకానగర మార్గంబు పట్టి చనియె;....
*రాజులంతా తేరుకునే లోపే తేరు(రథము) చాలా దూరం వెళ్ళిపోయింది*

అనేకమంది రాజులను బలరాముడు తన యదువీరులతో ఎదుర్కొన్నాడు.
జరాసంధుడు,శిశుపాలుడు మొదలైన రాజు లందఱు హరిపరాక్రమంబు విని
సహింపలేక పోయారు. శిశుపాలుడు ఉక్రోషం తట్టుకోలేక యింకా ముందుకు
వెడుతుంటే .........
జరాసంధుడు శిశుపాలుడ్ని వెనక్కి తీసుకు వెళ్ళాడు. కృష్ణుడు దెబ్బ ఏమిటో
నాకు బాగా తెలుసు.యిప్పటికి 17మార్లు కృష్ణుని పై దండయాత్ర కు
వెళ్ళాను.ప్రతిసారీ చావ చితకబాదాడు.కానీ ఎందుకో దయచేసి
వదిలి పెట్టేశాడు.ఎందుకో అర్థం కావటం లేదు.ఆఖరికి 18వ సారి వెళ్ళినప్పుడు
పారిపోతున్నట్టు నటించాడు.కృష్ణుడ్ని ఎదుర్కొనటం మహాకష్టం.ఇప్పుడు
మాత్రం వద్దు అని యింకా జరాసంధుడు ఈవిధంగా అంటూ శిశుపాలుడ్ని
వెనక్కి తీసుకువెళ్ళాడు....

"బ్రతుకవచ్చు నొడలఁ బ్రాణంబు లుండినఁ;
బ్రతుకు గలిగెనేని భార్య గలదు;
బ్రతికితీవు; భార్యపట్టు దైవమెఱుంగు;
వగవ వలదు చైద్య! వలదు వలదు."

ఎవరికి తప్పినా పుట్టింటి వారికి తప్పదు కదా !!! రుక్మి కి అవమానం తను చూసిన సంబంధం తాను అనుకున్న సంబంధం ఈవిధంగా జరగటంతో ... ఉక్రోషం తో ఆక్రోశం తో కృష్ణుడి రథం వెనకాల తన రథం తీసుకువెళుతూ ఈవిధంగా అరుస్తున్నాడు.

"గోపాలక! వెన్నముచ్చ! నిమిషమాత్రంబు నిలు నిలు" మని ధిక్కరించి, బలువింట నారి యెక్కించి మూడు వాఁడి తూపుల హరి నొప్పించి యిట్లనియె" రుక్మి కృష్ణుని గురించి చేసిన నింద లాగా కనిపించే కృష్ణ స్తుతి : పోతనగారి సంస్కారానికి ప్రతీక అయిన పద్యం తిట్టు లాంటి పొగడ్త

*మా సరివాఁడవా మా పాపఁ గొనిపోవ?*
*నేపాటి గలవాడ? వేది వంశ?*
*మెందు జన్మించితి? వెక్కడఁ బెరిగితి?*
*వెయ్యది నడవడి? యెవ్వఁ డెఱుఁగు?*
*మానహీనుఁడ *వీవు; మర్యాదయును లేదు*
*మాయఁ గైకొని కాని మలయ రావు*
*నిజరూపమున శత్రునివహంబుపైఁ బోవు*
*వసుధీశుఁడవు గావు వావి లేదు*
*కొమ్మ నిమ్ము; *నీవు గుణరహితుండవు*
*విడువు; విడువవేని విలయకాల*
*శిఖిశిఖా సమాన శిత *శిలీముఖముల*
*గర్వ మెల్లఁ గొందుఁ గలహమందు*

భావము:
నువ్వు మాతో సమానుడవా ఏమిటి (భగవంతుడు కదా మాకన్న అధికుడవు). ఎంత మాత్రం వాడివి (మేరకందని వాడవు). వంశ మేదైనా ఉందా (స్వయంభువుడవు). ఎక్కడ పుట్టావు (పుట్టు కన్నది లేని శాశ్వతుడవు). ఎక్కడ పెరిగావు (వికారరహితుడవు కనుక వృద్ధిక్షయాలు లేనివాడవు). ప్రవర్తన ఎలాంటిదో ఎవరికి తెలుసు (అంతుపట్టని నడవడిక కలవాడవు). అభిమానం లేదు (సాటివారు లేరుకనుక మానాభిమానాలు లేని వాడవు). హద్దు పద్దు లేదు (కొలతలకు అందని హద్దులు లేని వాడవు). మాయ చేయకుండ మెలగవు (మాయ స్వీకరించి అవతారాలు ఎత్తుతావు). స్వస్వరూపాన్ని పగవారికి చూపవు (నిర్గుణ నిరాకారుడవు). క్షత్రియుడవు కావు (జాతి మతాలకు అతీతుడవు). వావివరసలు లేవు (అద్వితీయుడవు ఏకోనారాయణుడవు). అసలు నీకు

గుణాలే లేవు (త్రిగుణాతీతుడవు). అలాంటి నీకు ఆడపిల్ల ఎందుకు. మా పిల్లని మాకు ఇచ్చెయ్యి. విడిచి పెట్టు. విడువకపోతే యుద్ధంలో ప్రళయకాల అగ్ని కీలల వంటి వాడి బాణాలతో నీ పీచమణుస్తా."

**Source**:బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం

◈◈◆◈◆◈◈◆◈◈◆◈

# శ్రీ కృష్ణ తత్త్వం-10

# ◆రుక్మిణీ కల్యాణం◆

వెంటనే కృష్ణుడు రథము ఆపి రుక్మి వైపు తిరిగి యుద్ధం చేశాడు.అసలు రుక్మి కి అవకశమే దొరకలేదు.అలా విజృంభించాడు కృష్ణ పరమాత్మ. తాను వేస్తున్న బాణ పరం పరలతో మొత్తం రుక్మి యొక్క రథం ముక్కలైపోయింది.
అతడి కిరీటం నేలపడిపోయింది.నిరాయుధుడై నిలబడి పోయాడు. కృష్ణ పరమాత్మ ఖడ్గం తీసుకుని రుక్మి పై ఎత్తాడు.
రుక్మిణి రథము మీద నుండీ దిగి కృష్ణుడి కాళ్ళు గట్టిగా పట్టుకుంది. స్వామి దయచేసి మా అన్న ను వదిలిపెట్టు.ఎందుకంటే
నిన్నునీశ్వర దేవదేవుని నిర్ణయింపఁగ లేక యో
సన్నుతామలకీర్తిశోభిత
*సర్వలోకశరణ్య!* మాయన్న యీతఁడు
*నేడు చేసె మహాపరాధము నీ యెడన్ నన్ను మన్నన చేసి కావు మనాథనాథ! దయానిధీ!*
మా తల్లిదండ్రులు పుత్ర శోకము దాల్చి చిక్కుదు రీశ్వరా!"

రుక్మిణీ దేవి కి కృష్ణుడి తో ఏ పరిచయం లేదు.ఇప్పుడే కలిసింది. డగ్గుత్తికతో మహాభయముతో ఆర్తి తో అడుగుతోంది.గొంతు బొంగురు పోయింది.
భయముతో అంటోంది...ఆప్పుడు కృష్ణ పరమాత్మ
చిఱునగవు నగుచు చంపక "బావా! ర" మ్మని
రుక్మి ని బంధించి తన ఖడ్గం తో గెడ్డాన్ని మీసాన్ని తలని సగం సగం కత్తిరించాడు. ఇది యించు మించు మరణదండనతో సమానము. ఈ విధంగా చేశాడు.
అప్పుడు బలరాముడు వచ్చి రుక్మి ని బంధం నుండి విడిపించి రుక్మిణీ దేవి తో ఇలా అంటున్నాడు,అప్పటికే బలరాముడి కి పెళ్ళి అయింది. ఆయన భార్య పేరు రేవతి.

◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈
"తోడంబుట్టినవాని భంగమునకున్ దుఃఖించి మా కృష్ణు నె
గ్గాడం జూడకు మమ్మ! పూర్వభవ కర్మాధీనమై ప్రాణులం
గీడున్ మేలును జెందు; లేఁ డొకఁడు శిక్షింపంగ రక్షింప నీ
తోడంబుట్టువు కర్మశేష పరిభూతుం డయ్యె నే డీ యెడన్."
◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈
*అన్నకు జరిగిన అవమానానికి దుఃఖించకు
పరమాత్మ దయామయుడు.ఆయనకు ఏ ఒక్కరి పట్ల ఆగ్రహం వుండదు.ఏ ఒక్కరిపట్ల అనుగ్రహం వుండదు.వారి వారి కర్మ కు అనుగుణంగా పరమాత్మ ప్రవర్తన వుంటుంది.
మా కృష్ణుడిని నిందించబోకు తల్లీ! పూర్వజన్మలలోని కర్మల వలన  జీవులకు మంచిచెడులు సంభవిస్తాయి. శిక్షించడానికి కాని రక్షించడానికి కాని కర్త ఎవరు లేరు. నీ అన్న అనుభవించ వలసిన శేష కర్మఫలం వలన ఇప్పుడు ఈ పరాభవం పొందాడు.యిప్పుడు ఈ విధంగా చేయటం వలన మీ అన్న కర్మ శేషం నశించింది.
*మాయ తో ముడి తొలగి బ్రహ్మ ము తో ముడి పడిన దివ్యమైన శోభ*
రుక్మిణీ కల్యాణం లో ఒక.తాత్త్వికమైన సంకేతాన్ని చూడాలనే సూచన మహానుభావుడైన  *నారాయణ భట్టాద్రి*
యిక్కడ మనకు తెలియచేస్తున్నారు.
అటుతరువాత మంగళసూత్ర ధారణ ఇత్యాదులు అన్నీ పూర్తయినాయి.
వధూవరులు యిద్దరూ కూర్చున్నారు.అటు తర్వాత అక్షతారోపణ జరుగుతోంది.అంటే తలంబ్రాలు పోసుకోవటం.
అయితే అక్షతారోపణం అంటే మన అందరికీ గుర్తుకు వచ్చేది సీతారాముల కళ్యాణ శోభ నాటి
అక్షతారోపణం.
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ  గారి ప్రవచనం
◈ ◈ ♦ ◈ ♦ ◈ ◈ ♦ ◈ ◈ ♦ ◈

# శ్రీ కృష్ణ తత్త్వం
# ♦ రుక్మిణీ కల్యాణం -11 ♦

జానక్యాః కమలామలాఞ్జలిపుటే యాః పద్మరాగాయితాః
న్యస్తా రాఘవమస్తకే చ విలసత్కున్దప్రసూనాయితాః
స్రస్తాశ్శ్యామలకాయకాన్తికలితా యా ఇన్ద్రనీలాయితాః
ముక్తాస్తాశ్శుభదా భవన్తు భవతాం శ్రీరామవైవాహికాః

సీతమ్మ చేతి లో ముత్యాలు పట్టుకుందట.ఆవిడ చేతులు పద్మాల్లాగ ఎర్రగా వున్నాయట.ఆ ఎరుపు ముత్యాల్లో ప్రతిఫలించిందట.
రామయ్య తలమీద వేస్తున్న సమయంలో ఆ మధ్య లో తెల్లగా కనిపించాయట
శ్రీ రాముని శరీరం మీద పడగానే అవి నీలంగా మారినాయట.
ఇది అక్కడ వున్నటువంటి వర్ణన
యిప్పుడు రుక్మిణీ కల్యాణం లో ఎట్లా భావిస్తున్నాడో చూడండి,
యోగిశ్వరుడైన నారాయణ తీర్థులు.యోగీశ్వరేశ్వరుడి పెళ్ళి యిది.

పూర్వం తెలుగువారి పెళ్ళి శుభలేఖలపైన యీ పద్యం తరచూ కనిపించేది. ఇది సీతారాముల పెళ్ళివేడుకలో ముత్యాల తలంబ్రాలను వర్ణించే పద్యం. పెళ్ళి శుభలేఖ మీద యీ శ్లోకం ఎందుకంటే, సీతారాముల పెళ్ళంత వైభవంగానూ తమ పెళ్ళివేడుక జరగాలని ఆకాంక్ష. సీతారాముల పెళ్ళంటే తెలుగువాళ్ళకి ఒక పండగ, ఒక సంబరం. ఈ శ్రీరామనవమి రోజు, సీతారాములు కొలువున్న ప్రతి హృదయమూ ఒక భద్రాచలమే. ప్రతి గుండెలోనూ మంగళవాద్యాలు మ్రోగవలసిందే.
కృష్ణ తత్త్వము వేరు, రామ తత్త్వము వేరు. *పరమార్ధం ఇద్దరూ ఒకటే* రాముడు మానవునిలా ప్రవర్తించాడు.కానీ మానవుని వలే కనిపిస్తున్నప్పటికీ పూర్తిగా నిర్వికారుడైన యోగీశ్వరేశ్వరుడు.ఏదీ అంటనివాడు,పరతత్త్వం. నిర్మలమైన తత్త్వం కృష్ణ తత్త్వం
కృష్ణుడు సాక్షాత్తు పరబ్రహ్మ.ఆ విషయం యోగులకు తెలుస్తుంది
అందుకే *నారాయణ తీర్థుల వారు* ఆ ధ్వనిని యిక్కడ చూపిస్తున్నారు.మనం కూడా తలంబ్రాల దృశ్యాన్ని చూద్దాం.
◈◈◆◈◆◈◈◆◈◈◆◈
భైష్మ్యా పాణి సరోరుహాంజలిగతా
రక్తాస్తు ముక్తాః స్తితాః
యా ముక్తాగళితానురాగ విమలాః
కృష్ణోత్తమాంగాశ్రయాః
యాతాస్తస్య యదూద్వహస్య
పరమమ్
సామ్యమ్ విసుధాత్మనః
తాఃకురువన్త్వభితః *శుభాని సతతం* *శ్రీ కృష్ణ వైవాహికాః*
*శ్రీ కృష్ణ వైవాహికాః*
◈◈◆◈◆◈◈◆◈◈◆◈
కృష్ణ వివాహ సమయంలో తలంబ్రాలు ఎలా వున్నాయో చూద్దాం.

భీష్మకుని పుత్రిక యైన రుక్మిణీ దేవి చేతిలో ఆ ముత్యాలు ఎలా వున్నాయంటే ఎర్రగా వున్నాయట అచ్చు సీతమ్మ లాగే.
ఎరుపు దేనికి సంకేతం అంటే ప్రేమకు అనురాగానికి సంకేతం.
*దోయిలించిన చేయి హృదయానికి సంకేతం*
తన హృదయంలో వున్న ప్రణయాన్ని ప్రేమను అంతటినీ కూడా కృష్ణుని కి అర్పిస్తోంది. తనను తాను సమర్పించుకుంటోంది.ఆ అర్పిస్తున్నపుడు యివి కృష్ణుని మీద పడినాయి.అయితే కృష్ణుని మిద పడితే ఎలా కనిపించాలి!!!???అచ్చు రామునికి లాగే నీలంగా కనిపించాలి!!చిత్రం ఏమిటంటే కృష్ణుని మీద పడిన వెంటనే ఆ ముత్యాలు తెల్లగా కన్పిస్తున్నాయట. యిందులో మర్మమేమిటంటే ,ఈవిడ సమర్పించినపుడు ప్రేమ అనే భావన వుంది.కృష్ణుని దగ్గిరకు వెళ్ళేటప్పటికీ అక్కడ భావాతీతమైన స్థితి అక్కడ వుంది. ఏ భావనా లేదు ఏ వర్ణము లేదు. వర్ణము వుంటే వికారము.ఏ వర్ణము లేదంటే నిర్వికారమైన తత్త్వము గా పరిణమించి పోయింది. కృష్ణుని కి సమర్పించిన హృదయం నేను అనే భావం నిర్వికార స్థితి లో లీనం అవుతుంది. అనే విషయాన్ని యిక్కడ *నారాయణ తీర్థులు* ప్రస్తావించారు. కనుక కృష్ణుని యొక్క నిర్వికార తత్త్వాన్ని యీ తలంబ్రాలు ఒక ప్రత్యేక మైన కోణంలో *నారాయణ తీర్థులు* చెప్పారు. ఈవిధంగా రుక్మిణీ కృష్ణుల కల్యాణ శోభ జరిగింది.
ప్రతివారి హృదయం లో ఈ రోజు రుక్మిణీ కృష్ణుల కల్యాణం జరిగింది.
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం
◈◈◆◈◆◈◈◆◈◈◆◈

## శ్రీ కృష్ణ తత్త్వం
## ◆ రుక్మిణీ కల్యాణం -12 ◆

**ఫలశ్రుతి**:-
అనఘ! యాదిలక్ష్మి యైన రుక్మిణితోడఁ
గ్రీడ సలుపుచున్న కృష్ణుఁ జూచి
పట్టణంబులోని ప్రజ లుల్లసిల్లిరి
ప్రీతు లగుచు ముక్తభీతు లగుచు."
రుక్మిణీ కృష్ణులను ఇద్దరినీ చూడగనే రెండు భావాలు కలుగుతున్నాయి.ప్రీతి,ముక్తభీతి అంటే *భయాలు తొలగిపోయాయి* *ఆనందం కలిగింది* మన అందరికీ కావలసినది యిదే కదా!!!
అమ్మ వచ్చినపుడు యింటికి ఎంత అంద మొస్తుందో రుక్మిణీ రావడం వలన ద్వారకకు అంత అందం వచ్చింది.

లక్ష్మీ నారాయణులే రుక్మిణీ కృష్ణులు
ఈ కథ లోవున్న అద్భుతమైన సంకేతం మనం అర్థం చేసుకోవాలి.ఈ కథంతా కూడా మనకు ఒక ఆదర్శం.
యిందులో రుక్మిణీ,రుక్మి, రుక్మరథ,రుక్మ బాహు రుక్మకేశ రుక్మగాని అందరూ రుక్ములే.బంగారము అంటే ఒక ప్రకాశం వెలుగు చైతన్యం.మనకు వేదాంత పరిభాష లో ఆత్మ కు పతి స్థానం బుద్ధి కి పత్నీ స్థానం చెప్పబడుతోంది.
అందుకే *శంకర భగవత్పాదుల వారు*......
*ఆత్మా త్వం గిరిజా మతిః*
*ఆత్మవు నువ్వు శివ*
*పార్వతీ దేవి మతిః అన్నారు*
పార్వతీ దేవి శివుడ్ని వివాహమాడింది అంటే అర్థం బుద్ధి భగవంతుడికి అంకితమైనది అని.
యిప్పుడు జరగవలసినది *బుద్ధిని పరమాత్మ కు యివ్వటము*
*అర్పించటము ఒక్కటే యోగం* అది అర్పించాలంటే ఎన్నో అడ్డంకులు వస్తాయి.
ఆత్మ యొక్క చైతన్యం తోనే బుద్ధి ప్రకాశిస్తుంది

ఆత్మ యొక్క చైతన్యం తో ప్రకాశిస్తున్న బుద్ధి యే రుక్మిణీ.ఆ బుద్ధి యొక్క శక్తి చేతనే మన శరీరంలో ప్రతీదీ కూడా ప్రేరేపించ బడుతున్నది.పంచ కర్మేంద్రియాలు పంచ జ్ఞానేంద్రియాలు పంచ ప్రాణాలు పనిచేస్తున్నాయి.
పంచభూత వికారము లతో కూడుకున్నదియే ఈ శరీరము.
ఈ పంచభూత వికారము లతో కూడుకున్న ఈ శరీరములో (ప్రకృతి) చైతన్యం వుంది.
*చైతన్యం వుంది కనుకనే శోభ*
ఇవి కూడా రుక్మము లే ఇవి కూడా బంగారు రంగు తోనే వున్నాయి. అంటే చైతన్యం తో నే వున్నాయి.ఈ చైతన్యానికి మూలం ఆత్మ యే.ఇది తెలుసుకున్నది తెలివైన బుద్ధి. ఈ బుద్ధి ఏమనుకుదంటే నాకు కృష్ణుడే పతి అని అనుకుంది.
అంటే ఆత్మ తో అనుసంధానము జరుపుకోవాలని అనుకున్నది.
కానీ రుక్మి ఏమిచేశాడంటే ఆమెకు శిశుపాలుడి కి యిచ్చి వివాహం చేద్దామనుకున్నాడు.
ఇందు లో వుండే మర్మము ఏమిటి!!!???

*బుద్ధి భగవంతుడికి అర్పించాలని అనుకున్నప్పటికీ కూడా ఇంద్రియములు బుద్ధి ని విషయాలవైపు లాగుతాయి.అది చేశాడు రుక్మి. ఈ బుద్ధి ని శిశుపాలుడికి యిచ్చి వివాహం చెద్దామనుకున్నాడు*
*శిశుపాలుడు అంటే ఆత్మ ను తెలియనివ్వని అజ్ఞానం*
శిశుపాలుడు పేరులో మర్మం
శిశు- పాల శిశు అంటే ఎదగనితనం.
చిన్నపిల్లలకు మనం కూర్చొపెట్టి బోధ చేసినా వాళ్ళకు అర్ధం కాదు.అది వాళ్ళ దోషం కాదు. వాళ్ళ బుద్ధి కి maturityరాలేదు.
కనుక శిశు అంటే ఎదగనితనం.
ఎదగనితనం అంటే అజ్ఞానమే.
ఎదగని తనానికి వాడు పాలకుడు.అంటే అజ్ఞానానికి పాలకుడు.
పూర్తి అజ్ఞాన స్వరూపుడు శిశుపాలుడు.
ఈ అజ్ఞానం తో ముడివెయ్యాలని చూస్తున్నాడు రుక్మి. మన అందరికీ యిదే అవస్థ.

*బుద్ధిని ని భగవంతుడికి అర్పిద్ధామని సాధన చేస్తూవుంటే ఈ పంచేంద్రియ వికారములు బుద్ధిని ప్రపంచంవైపు లాగుతాయి.అప్పుడు ఏమి చెయ్యాలంటే తెలివైనవాడు గురువును ఆశ్రయించాలి.వాడే అగ్నిద్యోతనుడు*
అగ్నిద్యోతనుడు అనే గురువును ఆశ్రయించటం వల్ల *గురువు ఏం చేస్తున్నాడంటే పరమాత్మ తో అనుబంధాన్ని ఏర్పాటు చేశాడు* అనుబంధము ఏర్పాటు చేస్తే పరమాత్మ యే ముక్తిని యిస్తాడు కానీ నీయంతట నీవు తెచ్చుకోలేవు.పరమాత్మ అనుగ్రహం లేనిదే ముక్తి రాదు.పరమాత్మ వచ్చి తీసుకున్నాడు. ఆ పరమాత్మ వచ్చి గ్రహించినపుడు అడ్డుకొనే సమస్త మాయా వికారములను ఆయన తొలగించాడు.
ఇది గ్రహించవలసిన విషయం
మర్మము.
రుక్మిణి ని కృష్ణుడి కి యివ్వటమంటే ఆ చైతన్య స్వరూపిణియైన బుద్ధిని చైతన్యానికి మూలమైన పరమాత్మ కు సమర్పించటమే. యిందులో వున్న అసలైన అంతరార్థం యిదే!! *బుద్ధిని భగవంతుడికి*
*సమర్పించటమే అసలైన రుక్మిణీ కల్యాణం*
**Source**:బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారి ప్రవచనం
◈◈◆◈◆◈◈◆◈◈◆◈

## ◆ కృష్ణాష్టకం ◆

వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనమ్ |
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ||
అతసీ పుష్ప సంకాశం హార నూపుర శోభితమ్ |
రత్న కంకణ కేయూరం కృష్ణం వందే జగద్గురుమ్ ||
కుటిలాలక సంయుక్తం పూర్ణచంద్ర నిభాననమ్ |

విలసత్ కుండలధరం కృష్ణం వందే జగద్గురమ్ ||
మందార గంధ సంయుక్తం చారుహాసం చతుర్భుజమ్ |
బర్హి పింఛావ చూడాంగం కృష్ణం వందే జగద్గురుమ్ ||
ఉత్ఫుల్ల పద్మపత్రాక్షం నీల జీమూత సన్నిభమ్ |
యాదవానాం శిరోరత్నం కృష్ణం వందే జగద్గురుమ్ ||
రుక్మిణీ కేళి సంయుక్తం పీతాంబర సుశోభితమ్ |
అవాప్త తులసీ గంధం కృష్ణం వందే జగద్గురుమ్ ||
గోపికానాం కుచద్వంద కుంకుమాంకిత వక్షసమ్ |
శ్రీనికేతం మహేష్వాసం కృష్ణం వందే జగద్గురుమ్ ||
శ్రీవత్సాంకం మహోరస్కం వనమాలా విరాజితమ్ |
శంఖచక్ర ధరం దేవం కృష్ణం వందే జగద్గురుమ్ ||
కృష్ణాష్టక మిదం పుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్ |
కోటిజన్మ కృతం పాపం స్మరణేన వినశ్యతి ||

◈ ◈ ◆ ◈ ◆ ◈ ◈ ◆ ◈ ◈ ◆ ◈

## ◆ మహాలక్ష్మి అష్టకం ◆

**ఇంద్ర ఉవాచ –**

నమస్తేఽస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే |
శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మి నమోఽస్తు తే || 1 ||
నమస్తే గరుడారూఢే కోలాసుర భయంకరి |
సర్వపాపహరే దేవి మహాలక్ష్మి నమోఽస్తు తే || 2 ||
సర్వజ్ఞే సర్వవరదే సర్వ దుష్ట భయంకరి |
సర్వదుఃఖ హరే దేవి మహాలక్ష్మి నమోఽస్తు తే || 3 ||
సిద్ధి బుద్ధి ప్రదే దేవి భుక్తి ముక్తి ప్రదాయిని |
మంత్ర మూర్తే సదా దేవి మహాలక్ష్మి నమోఽస్తు తే || 4 ||
ఆద్యంత రహితే దేవి ఆదిశక్తి మహేశ్వరి |
యోగజ్ఞే యోగ సంభూతే మహాలక్ష్మి నమోఽస్తు తే || 5 ||
స్థూల సూక్ష్మ మహారౌద్రే మహాశక్తి మహోదరే |

మహా పాప హరే దేవి మహాలక్ష్మి నమోఽస్తు తే || 6 ||
పద్మాసన స్థితే దేవి పరబ్రహ్మ స్వరూపిణి |
పరమేశి జగన్మాతః మహాలక్ష్మి నమోఽస్తు తే || 7 ||
శ్వేతాంబరధరే దేవి నానాలంకార భూషితే |
జగస్థితే జగన్మాతః మహాలక్ష్మి నమోఽస్తు తే || 8 ||
మహాలక్ష్మష్టకం స్తోత్రం యః పఠేద్ భక్తిమాన్ నరః |
సర్వ సిద్ధి మవాప్నోతి రాజ్యం ప్రాప్నోతి సర్వదా ||
ఏకకాలే పఠేన్నిత్యం మహాపాప వినాశనమ్ |
ద్వికాల్ం యః పఠేన్నిత్యం ధన ధాన్య సమన్వితః ||
త్రికాలం యః పఠేన్నిత్యం మహాశత్రు వినాశనమ్ |
మహాలక్ష్మీ ర్భవేన్-నిత్యం ప్రసన్నా వరదా శుభా ||
ఏతత్ ఫలం సర్వం శ్రీకృష్ణ పర బ్రహ్మార్పణ మస్తు
ఉమా మహేశ్వర పరబ్రహ్మార్పణ మస్తు